మహిళా సాధికారతే ధ్యేయం

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి




ఆసరా సభకు హాజరైన మహిళలు, మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా

పుట్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, జగనన్న తన అక్కచెల్లెమ్మలకు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కలిపించడానికి తపిస్తున్నారని తెలిపారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం ఇలా అన్ని పథకాల ద్వారా లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. 2014లో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి ఒక్క రూపాయి మాఫీ చేయలేదని, జగనన్న మాత్రం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. గతంలో మండల ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడేవారని, వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన అనంతరం ఏటా చెరువులకు నీరు నింపడం ద్వారా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అర్హతే ప్రమాణికంగా రాజకీయాలు, కుల మత, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను అమలు చేసిన జగనన్నను 2024లో జరిగే ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం 6,149 మంది మహిళా సంఘాల సభ్యులకు మూడో విడత ఆసరా కింద రూ.4.5 కోట్లను మెగా చెక్కు రూపంలో అందజేశారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలివెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు ఓబుశేసు, మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకురాలు భూమిరెడ్డి సునీతమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏపీఎం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుంతకల్లుటౌన్: అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలపై అధికారులను నిలదీసిన విద్యార్థులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట నోళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. యూనివర్సిటీలో జరిగే అక్రమాలు, అన్యాయాల్ని ప్రశ్నించిన విద్యార్థులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సుధాకర్, రాజేంద్రప్రసాద్, డీవైఎఫ్ఐ నాయకులు చరణ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భవనాలు త్వరగా పూర్తి చేయాలి



బూదేడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

గార్లదిన్నె: మండలంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ ఓబుళమ్మ కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం బూదేడు, శిరివరంలో గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది రోజూ బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అలాగే ఎస్‌డీజీ సర్వే , సంక్షేమ కార్యక్రమాలు అమలు తీరు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం శిరివరంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొంత మంది ఇళ్లు మంజూరైన ఇప్పటి వరకు పనులు చేపట్టలేదన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరత గతిన పూర్తిచేసుకోవాలన్నారు. ప్రభుత్వం కాలనీల్లో అన్ని వసతులు కల్పించడంతోపాటు బిల్లులు సకాలంలో అందజేస్తోందన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ విజయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

గుంతకల్లు రూరల్: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని యునైటెడ్ క్రిష్టియన్ వెల్ఫేర్ ఫోరం సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక యూసీడబ్ల్యూఎఫ్ కార్యాలయంలో సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. గత నెల 24న అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాల్లో చేర్చే తీర్మానానికి ఆమోదం తెలపడం పట్ల ఆంధ్ర రాష్ట్ర క్రైస్తవులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా 1998 మెమోను రద్దు చేయాలని కోరారు.

గృహ సందర్శన తప్పనిసరి

గార్లదిన్నె: ఆశావర్కర్లు గృహాలను సందర్శించి గర్భిణులు, చిన్న పిల్లలకు సేవలు అందించాలని పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి పేర్కొన్నారు. మంగళవారం గార్లదిన్నెపీహెచ్‌సీలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న కిల్కారి కార్యక్రమం, మొబైల్ అకాడమీ కోర్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. గృహ సందర్శనకు వెళ్లినప్పుడు 14424 నంబర్‌కు ఫోన్ చేసి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినిపించాలన్నారు. డాక్టర్లు హనీషా, దిలీప్‌కుమార్, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆశా నోడల్ అధికారి నాగమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం



వడ్లపాలెంలో సమస్యలపై ఆరా తీస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని 25 వార్డులోని వడ్లపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ తిరుగుతూ కాలనీవాసులతో మాట్లాడారు. తాగునీరు కుళాయిలకు సక్రమంగా వస్తోందా, పారిశుద్ధ్య పనులు సరైన వేళల్లో నిర్వహిస్తున్నారా అంటూ ఆరా తీశారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు సమస్యలపై స్పందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇంచార్జ్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి జబ్బార్‌బాషా, వంగనూరు సూరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : తెలికి గ్రామంలో మంగళవారం పెద్దమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం మండల నాయకులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు.

సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలి



కొత్తపేటలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సుభాష్‌రెడ్డి

గుత్తి రూరల్: వచ్చే ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పని చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కొత్తపేట, తొండపాడు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహ సారథులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకూ మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు కాని హామీలను ప్రజలకు తెలియజేయాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారు సూచించారు. సర్పంచ్ గురుమస్తాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాముయాదవ్, సుధాకర్, శేషారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట్రాముడు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని ఇంటింటా వివరించండి



వెన్నపూసపల్లిలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించడంతోపాటు ఇంటింటికీ స్టిక్కర్లు అతికించాలని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం నిట్టూరు, పెద్దమల్లేపల్లి, చిలమకూరు, యల్లనూరు-1, యల్లనూరు-2, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 14 వరకు జరగబోయే జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి సచివాలయంలో ప్రతి 50 ఇంటికీ ఒక వలంటీర్లు, ముగ్గురు గృహసారథులు బృందంలా ఏర్పడి ప్రతి ఇంటిలో ఎన్ని సంక్షేమ పథకాలు వచ్చాయి, గత ప్రభుత్వంలో ఎంత లబ్ధి చేకూరింది, ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి, రైతులకు, ప్రజలు ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. రోజుకు 8 లేక 9 ఇళ్లను సందర్శించి ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాలపై చర్చించి జగనన్నే మా భవిష్యత్తు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ప్రతి ప్రజాప్రతినిధి, వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి ఇంటింటా తిరిగి సమస్యలు తెలుసుకోవాలన్నారు. టోల్‌ఫ్రీ నంబరుకు మిస్డ్ కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, పెద్దనాగరాజు, సచివాలయ కన్వీనర్లు జాఫర్, చాంద్‌బాషా, కిరణ్, పెద్దిరెడ్డి, ఎంపీటీసీ తిమోతి, నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, దిలీప్, హరిశ్చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మునిస్వామినాయుడు, తిరుపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో అనంతపురం తాడిపత్రి రహదారి పక్కన విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బుధవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేడు సచివాలయాల తనిఖీ

యల్లనూరు: మండలంలోని బొప్పేపల్లి, తిమ్మంపల్లి, బుక్కాపురం, గొడ్డుమర్రి, కల్లూరు, దంతలపల్లి తదితర గ్రామాల్లోని సచివాలయాలను బుధవారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తనిఖీ చేయనున్నారు. ఈనెల 7న ప్రారంభమయ్యే జగనన్నే మా భవిష్యత్తు నిర్వహణపై గృహసారథులు, వలంటీర్లతో సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మునివేలు

తాడిపత్రి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం మంగళవారం రెవెన్యూ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని తహసీల్దార్ మునివేలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయానికి పనుల మీద వచ్చే ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజినేయప్రసాద్, మండల సర్వేయర్ రామ్మోహన్, వీఆర్‌ఓలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి అర్బన్: శ్రీరామ నవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడిగడ్డపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరాముడు కాళింగ మర్దన అలంకారంలో కొలువుదీరాడు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న ఉభయదారులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించండి



ట్రాన్స్‌కో అధికారులకు సమస్య వివరిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 24వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తును పెంచడంతో పాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని ఆమె కోరారు. ట్రాన్స్‌కో ఏఈ రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత జమీల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిని తెలియజేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. మంగళవారం నీలాంపల్లి, చెదుల్ల, గోవిందపల్లి, వడియంపేట సచివాలయాల్లో సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ కార్యక్రమం అందిస్తోందన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకు చేపట్టే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను సీఎం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, అంకే ముసలన్న, ఎంపీటీసీ ఎర్రినాగప్ప, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, అనంత వెంకటరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పుల్లారెడ్డి, చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సురేష్ డీలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్ఆర్ఐటీ కళాశాల వార్షికోత్సవం



బహుమతులందిస్తున్న రెక్టార్ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 15వ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమానికి ఆర్‌జీయుకేటీ, జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, కళాశాల చైర్‌పర్సన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. కళాశాలలో బ్రాంచ్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాలలో సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్యా రవి సందడి చేశారు. మీటర్ సినిమా ట్రైలర్ విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు ప్రబోధానంద జయంతి

తాడిపత్రి అర్బన్: చిన్నపొలమడలోని శ్రీకృష్ణాశ్రమంలో త్రైత సిద్ధాంత సృష్టికర్త, హిందూ ధర్మప్రదాత ఆచార్య ప్రబోధానంద జయంతిని బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లను ఆశ్రమ నిర్వాహకులు పూర్తి చేశారు. వేడుకలకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండే కాకుండా పలు రాష్ట్రాల నుంచి ప్రబోధానంద భక్తులు మంగళవారం సాయంత్రమే పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సమస్యలు తీర్చాలని వినతి

తాడిపత్రి: తమ సమస్యలు తీర్చాలని ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు చుక్కలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్యకుమారికి అందజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10 న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు ఆశా వర్కర్లు హాజరుకావాలని వారు కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు కవితమ్మ, ఆశా వర్కర్ల యూనియన్ నేతలు మమత, లలిత, దేవి పాల్గొన్నారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దవడుగూరు : రావులుడికి గ్రామంలో చెన్నమ్మతిరునాల ముగింపు సందర్భంగా గ్రామంలో బుధవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఒంగోలు జాతి న్యూ కేటగిరీ విభాగంలో విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

పామిడి: స్థానిక బెస్తవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కౌన్సిలర్ ఎం రామాంజనేయులు తన మనవడు జన్మదినాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ పిల్లలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత వాటిని అందించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పిల్లలకు తీపి, పిండి వంటలతో కూడిన భోజనం పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఈనెల 1న రోడ్డు దాటుతున్న ఓల్డ్ సీపీఐ కాలనీకి చెందిన హనుమంతును గుత్తి ఆర్ఎస్ వైపు వెళ్లే బైక్ ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి, అనంతపురం ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం అక్కడే మృతి చెందినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

యాడికి: రెండు రోజుల క్రితం కుందనకోట గ్రామ శివారులోని కొండ ప్రాంతం వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు కనుగొన్న విషయం తెలిసిందే. ఘటన స్థలిని డీఎస్పీ వీఎన్‌కె చైతన్య ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, క్లూస్ టీం బృందాలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రత్యేక జాగిలాలతో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులు వెనుతిరిగారు. మృతున్ని ఎవరైన ఎక్కడైనా హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా? లేక ఇక్కడే హత్య చేశారా అన్న కోణంలో విచారణ చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

చెట్టుకొమ్మలు పడి ఇద్దరికి గాయాలు

శింగనమల: కొరివిపల్లి వద్ద రోడ్డు పక్కలో చెట్టు కోస్తుండగా కొమ్మలు బైక్ మీదపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..మంగళవారం కొరివిపల్లి వద్ద రోడ్డుకు ఉన్న చెట్లను కొందరు కోస్తున్నారు. ఇంతలో బైక్‌పై అటుగా వచ్చిన గుమ్మేపల్లికి చెందిన బాలబ్రహ్మం ఆచారి, ప్రసన్న లక్ష్మీపై కొమ్మలు పడ్డాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని 108లో అనంతపురం తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పూడిక తొలగింపుతో భూగర్భ జలాల పెంపు

గుత్తి రూరల్: గ్రామాల్లోని చెరువుల్లో పూడిక తొలగింపు ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని సర్పంచ్ గురుమస్తాన్ అన్నారు. మంగళవారం కొత్తపేట గ్రామం నాగేపల్లి చెరువులో పూడిక తొలగింపు పనులను సర్పంచ్, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల్లో ఎన్నో ఏళ్లుగా పూడిక పేరుకుపోవడంతో వర్షపునీరు నిల్వ ఉండటం లేదన్నారు. చెరువుల్లో పూడికను తొలగించడం ద్వారా వర్షం నీటి ప్రతి బొట్టును ఒడిసి పట్టవచ్చన్నారు. పూడిక తొలగించడంతో చెరువులో ఎక్కువ నీరు చేరడం ద్వారా గ్రామ సమీపంలోని వ్యవసాయ, తాగు నీటి బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం వారు గడ్డపారతో తవ్వి పనులను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు రాముయాదవ్, నాయకులు సుధాకర్, సురేష్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుత్తి రూరల్: పట్టణ శివార్లలోని కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై నాటుసారా తరలిస్తున్న కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రోళ్లపాడు తండాకు చెందిన గోవిందు నాయక్ అనే వ్యక్తిని మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందతుడి నుంచి 60 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఆర్యవైశ్యుడి ఇఫ్తార్ విందు

పామిడి: స్థానిక సున్నీ జామియా మసీదులో ముతువలీ బీ రుక్మాన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య యువకుడు(రాజేష్ క్యాటరింగ్) రాజేష్ ముస్లింలకు ఇఫ్తారు విందు ఇచ్చారు. తానే స్వయంగా దాదాపు 600 మంది జమాత్ సభ్యులకు విందు వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బీ ఆసిఫ్, ఫర్యాద్, తాజ్ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు దాదాఖలందర్, జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

పామిడి: ఎద్దులపల్లిలోని మంగళవారం చౌడేశ్వరి మాత జ్యోతుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వైవీఆర్ అల్లుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి దర్శించుకొని పూజలు చేయించారు. అనంతరం ఆయనతో పాటు గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి తదితరులు అమ్మవారి జ్యోతులను తలపై ఉంచుకుని గ్రామోత్సవం నిర్వహించారు. సీనియర్ చుక్కలూరు రామకృష్ణారెడ్డి, సచివాలయాల రూరల్ కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, వీరా, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: కుమ్మెత గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఖాజా హుస్సేన్ పర్యవేక్షించారు.

బదిలీలు నిలిపివేయాలని వినతి

పుట్లూరు: ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న సాంకేతిక సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లను ఇతర జిల్లాలకు బదిలీలను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని మంగళవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి వినతిపత్రం అందించారు. సాంకేతిక సహాయకుడు విజయ్‌నాగేంద్రరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బాబా, కంప్యూటర్ ఆపరేటర్లు గంగాధర్, నాగేంద్ర కుమార్ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా జగదీష్



గుంతకల్లు: ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడిగా గోపా జగదీష్ ఎంపికయ్యారు. మంగళవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవితో పాటు 17 మంది శాశ్వత సభ్యులు, 19 మంది సాధారణ సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 1,170 మంది ఓటర్లు ఉండగా 840 ఓట్లు పోల్ అయ్యాయి. అధ్యక్ష పదవికి నలుగురు పోటీలో నిలవగా గోపా జగదీష్ , పువ్వాడి చంద్రశేఖర్ మధ్య పోటీ నెలకొంది. సీకే రామాంజనేయులుకు 24 ఓట్లు లభించగా, నామా జీవన్ గుప్తాకు 28 ఓట్లు, పువ్వాడి చంద్రశేఖర్‌కు 260 ఓట్లు లభించాయి. కాగా గోపా జగదీష్‌కు 256 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.